# మధుమాసంలోనే....

పోస్టులో వచ్చిన ఉత్తరం అందుకుంటూనే అనసూయ ఉలిక్కిపడింది. ఫ్రమ్ ఎడ్రస్ రాయకపోయినా ఆ హేండ్ రైటింగ్ తను గుర్తుపట్టగలదు. శశికాంత్ పరిచయం ఈనాటిదా? ఆఫీసులో పక్క పక్క సీట్లలో ఆరేళ్లు పనిచేశారు. ప్రేమలేఖలు రాయకపోయినా మంచి కవిత్వం ఏదైనా కనబడితే కాగితం మీద రాసుకొచ్చి తనకు బహుమతిగా ఇచ్చేవాడు. అతని చేతిరాతలో ప్రతీ వంపూ, ప్రతి మలుపూ తనకు సుపరిచితమే. ఉత్తరం ఎందుకు రాసినట్టు? తన చిరునామా ఎందుకు రాయనట్టు? భర్త కంటబడుతుందనా? కంటబడినా ఎక్కణ్నుంచి వచ్చిందో గుర్తుపట్టలేడనా!?

శశి భయాలే కానీ తను రవితో చెప్పేసింది. "శశికాంత్ అనే కొలీగ్ నన్ను చేసుకుందామనుకున్నాడు కానీ ఎన్నడూ నోరు విప్పి అడగలేదు, నాకూ అతనంటే ఇష్టమే కానీ అతను అడగకపోవడంతో ఊరుకున్నాను; మీరు కనబడగానే మనసు పారేసుకున్నాను" అని. విని రవి నవ్వేశాడు, "పోన్లే అతని పిరికితనం నాకు వరంగా పరిణమించింది" అంటూ.

శశికి పిరికితనమనే కాదు, అతని తరహాయే అంత. సెల్ఫ్ కాన్షస్‌నెస్ మరీ ఎక్కువ. వెనక్కాల పెళ్లికెదిగిన చెల్లెళ్లున్నారు. 'వాళ్లని వదిలేసి నిన్ను చేసుకోలేను. కొంతకాలం ఓపిక పట్టు. పెళ్లాడదాం' అని చెప్పవచ్చుగా! ఊహూం, అలా అన్నదాకా ఉండి ఏదైనా మంచి సంబంధం వచ్చినా అతని గురించి వదిలేసి ఇబ్బంది పడతానేమోనని బెంగ. తనంటే అంత అభిమానం, ప్రేమ ఉండడం గర్వంగా అనిపించినా, ఆ కాస్త 'ఐ లవ్ యూ' అనేయచ్చుగా అని తన బాధ!

తనూ, అతనూ ఒకే స్థాయిలో ఉన్నప్పుడు అతను ఎప్పటికైనా నోరు విడిచి అడుగుతాడనే ఆశ ఉండేది. కానీ అనుకోకుండా తనకు డబ్బు కలిసిరావడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆ ముక్తేశ్వరం నాయనమ్మ చచ్చిపోతుందనీ, ఎవరికీ తెలియకుండా ఆవిడ నాలుగు లక్షలు దాస్తుందనీ, అది తనకు మాత్రమే చెందాలనీ విల్లురాస్తుందనీ తను మాత్రం కలకన్నదా? నాన్నగారు కూడా "ఆ డబ్బు నీదే! మీ అమ్మ ఎలాగూ లేదు. నేను ఈ పల్లెటూరు వదిలి వచ్చేది ఎలాగూ లేదు. నీ దగ్గర ఆ డబ్బు ఉంటే అది చూసైనా ఎవడైనా మంచి కుర్రవాడు నిన్ను చేసుకుంటానంటాడేమో! నువ్వే ఉంచుకో. నాకేమీ వద్దు" అనేశారు.

ఆ డబ్బు మంచి కుర్రవాణ్ని తేకపోగా, ఉన్న స్నేహితుణ్ని దూరం చేసింది. అప్పణ్నుంచి శశి తిరగడం కూడా తగ్గించేడు. ఆ డబ్బు చూసి అతను వెంటబడుతున్నాడని తను అనుకుంటుందేమోనని అతని భయం! ఆహాం! ఈ మొగాళ్ల ఇగోకి అర్థం ఉందాని!? అతనికే ఆ డబ్బు వచ్చి ఉంటే మర్నాటికి తామిద్దరికీ పెళ్లయిపోయి ఉండేది. తనకు వచ్చింది కాబట్టి బెడిసికొట్టింది. తనకు కోపం వచ్చినమాట వాస్తవం. సంక్రాంతి దాకా చూసి తనే అందామనుకుంది. "శశీ! ఈ డబ్బు నీదే అనుకో. నేను కట్నంగా ఇచ్చాననుకో. ఇది పెట్టి మీ చెల్లెళ్ల పెళ్లి చేసేసేయి. మనం ముసలాళ్లయి పోకముందే నన్ను పెళ్లాడేయ్." అని.

కానీ జనవరి ఫస్టు నాటి పార్టీ, కథంతా మార్చేసింది. రవి పరిచయమయ్యాడు. ఒక్కదెబ్బకి తను గుమ్మైపోయింది. అలాటి ఆకర్షణ ఉంది రవిలో. ఆ ఠీవీ, ఆ ధాటీ, ఆ చొరవ వెయ్యి జన్మలెత్తినా శశికి రావు. శశి సౌమ్యుడే, సజ్జనుడే, ఆరాధకుడే. కానీ ఆడవాళ్లను ఆకట్టుకోవడంలో రవికి సాటిరాడు. రవితో మాట్లాడిన ఏ ఆడదైనా గంట తిరక్కుండా అతనంటే వెర్రెక్కిపోతుంది. అటువంటివాడు

పరిచయమయిన గంటలోపే పెళ్లి చేసుకోమని అడిగితే తను కాదనగలదా?

భర్త గుర్తుకురాగానే అనసూయ మనస్సు ఆహ్లాదంతో నిండిపోయింది. చేతిలో ఉత్తరాన్ని బల్లమీద పడేసి తోటలోకి నడిచింది. ఈ ఇల్లన్నా, తోటన్నా ఆమెకు ఎంతో ఇష్టం. పెళ్లి కుదిరిన పదిరోజుల్లోనే రవి ఈ పల్లెటూళ్లో ఇంటి గురించి చెప్పాడు, పేపర్లో ప్రకటన చూసి."పల్లెటూళ్లో ప్రశాంతమైన వాతావరణంలో కాటేజి లాటి ఇల్లంటే నీకు ఇష్టమా?" అని అడిగితే అనసూయ ఎగిరి గంతేసింది. "నీ టేస్టుపై నాకు పూర్తి నమ్మకం ఉంది. ఇల్లు చూసి బాగుంటే కొనేయ్. మన హనీమూన్ అక్కడే" అని చెప్పేసింది. ఇల్లు చూసాక రవి ఫోన్ చేసాడు, "చాలా బాగుంది. కానీ మూడు లక్షలంటున్నాడు. నేను ఇల్లు కొని నీకు బహుమతిగా ఇద్దామనుకున్నాను కానీ నా దగ్గర ఉన్నది లక్షే. ఈసారికి ఊరుకుందాం. వచ్చే ఏడాది నాకు వ్యాపారంలో కలిసివచ్చాక కొందాం" అని.

అనసూయ మందలించింది. "నా దగ్గరున్న డబ్బు నీది కాదా? రెండు లక్షల డిపాజిట్ తీసేసి నీకిస్తాను. నీ పేరనే ఇల్లు కొనేయ్. తర్వాత డబ్బు రావచ్చు కానీ నచ్చిన ఇల్లు దొరకద్దూ?" అని. అయిష్టంగానే ఒప్పుకున్నాడు రవి.

మధుమాసానికి ఈ ఇంటికి రాగానే అనసూయ ముగ్ధురాలైపోయింది. ఊరికి దూరంగా పెద్ద కాటేజీ... చుట్టూ తోట... ఇక్కడి ప్రశాంతత చూడగానే అనసూయ చేసిన మొదటి పని ఉద్యోగానికి రాజీనామా లేఖ పంపడం. రవికి చెప్పింది, "నీ బిజినెస్ మరీ అంత పెద్దది కాకపోయినా ఇద్దరు మనుష్యులు బతకడానికి సరిపోక పోదు. మరీ ఏదైనా అవసరం పడితే నా రెండు లక్షల ఫిక్సెడ్ డిపాజిట్ ఎలాగూ ఉంది" అని.

తోటలో విహరిస్తున్న అనసూయ కంటికి తోటమాలి రంగన్న కనబడ్డాడు. 'ఇవాళ బుధవారం కదా, ఎందకు వచ్చాడు?' అనుకుంది. రోజు విడిచి రోజు వచ్చి తోటపని చేసే ఒప్పందం అతనితో.

"ఆయ్ఁ, రేపు ఊరెలుతున్నారట కదా, ఇవాళే చేసేసి ఎల్లిపోదామని ఒచ్చానండి." అన్నాడు వాడు.

"వస్తే వచ్చావులే కానీ, రేపు ఊరెలుతున్నానని నీకెవరు చెప్పారు?" అడిగింది అనసూయ ఆశ్చర్యంగా.

"అయ్యగారండి. టేషన్‌కాడ కనబడ్డారు. ఏటండీ అంటే, 'రేపు అమ్మగారు. ఐదరాబాదు ఎల్తున్నారోయ్' అన్నారు. ఎల్లి ఒచ్చేసరికి ఎన్నాళ్లు పడద్దో, ఓ పాలి ఎల్లి గడ్డి పీకేస్తే సరిపోద్దిగదాని ఒచ్చానండి."

"నీకేమైనా మతిపోయిందా? ఎవర్ని చూసి ఎవరనుకున్నావో, అసలే ముసలాడివి. చూపు ఆనదు. నేను ఊరెలుతున్నానని అయ్యగారనడం ఏమిటి... నీ తలకాయ!" అంది అనసూయ విసుగ్గా.

"బలేవోరు. నాకా మాత్తరం తెలీదేటండి. అయ్యగారు సెప్తేను. కావాలంటే ఆయన్నే అడగండి." అన్నాడు రంగన్న పట్టు విడవకుండా.

'భర్త తనకు ఏదో ప్లెజెంట్ సర్‌ప్రైజ్ ఇస్తున్నాడులాగుంది. వీడివల్ల అది ముందే తెలిసిపోయింది.' అనుకుని అనసూయ మాట మార్చింది. "సరేలే, అడుగుతానులే గానీ. ఇంతకుముందు కూడా ఈ తోట పని నువ్వే చూసేవాడివా?"

"మరి ఏమనుకున్నారు? ఈ తోటలో సగానికి సగం మొక్కలు, చెట్లు నేను ఏసినవే. బూషణం గారు, అదేనండి, ఇంతకుముందు ఇల్లుగలాయన అనేవారు, 'ఒరే రంగన్నా, ఈ తోట నీదేరా! ఇల్లు మాత్తరమే నాది' అని. పాపం ఇల్లు కూడా అమ్ముదామనుకోలేదు. అంత ఇష్టం ఆయనకి..."

"మరి ఎందుకమ్ముకోవలసి వచ్చింది?" ఆసక్తిగా అడిగింది అనసూయ.

"కొడుకు చేసిన నిర్వాకమండి. ఏపారం అంటూ రెండు లచ్చలు అప్పుచేసేశాడు. అది తీర్చాలంటే ఇల్లు అమ్మాల్సిందే. ఆ రేటు కావాలంటాడీయన. అక్కడికి నేను సెప్పాను. 'పాత ఇల్లండి. రెండు లచ్చలు రేటు పలకదండీ' అని. జనాలు రావడం, సూడ్డం, రేటు విని పారిపోవడం. చివరికి రెండు లచ్చలొచ్చేసరికి బెమ్మపెళయం అయిందండి." అన్నాడు నిట్టూరిస్తూ.



అనసూయ విసుక్కుంది. "చాల్లే నీ తెలివి! మేం మూడు లక్షలిచ్చి కొన్నాం. తెలియకపోతే ఊరుకో."

ముసలాడు పట్టు విడవలేదు. "బలేవోరు. నాకు తెల్దేటి! రెండు లచ్చలకేగా బేరాలయ్యింది. మూడెవడిత్తాడు ఈ పాత కొంపకి..." అని మొదలెట్టాడు.

తను ఎంతగానో మెచ్చిన ఇంటిని పాతకొంప అనడం నచ్చలేదు అనసూయకు. ఈ మూర్ఖుడితో వాదించి ప్రయోజనం లేదనుకుని ఇంట్లోకి వచ్చేసింది చికాగ్గా. టేబుల్ మీద శశికాంత్ ఉత్తరం పలకరించింది. తనకు అంత ఫ్రెండ్ అయిన శశి ఉత్తరం వస్తే చూడకుండా తాత్సారం చేయడమేమిటని తనలో తానే తర్కించుకుంది. కారణం కూడా సుస్పష్టమే. రవిని పెళ్లి చేసుకోబోతుందని తెలియగానే అతను రియాక్ట్ అయిన తీరే దానికి సమాధానం. అనసూయ కూడా మౌనంగా ఊరుకోలేదు.

"ఆరేళ్ల పరిచయంలో ఒక్కసారి కూడా మనస్సు విప్పి మాటాడలేని చవట కాదు రవి. డేషింగ్ యంగ్ ఫెలో. అతన్ని చూసి అసూయపడేవాళ్ల పట్ల నాకు జాలి." అనేసింది.

"అతనితో నీకు పరిచయం బొత్తిగా లేదు. కలిసిన గంటలో పెళ్లాడమని అతను అడగడం, వారం తిరక్కుండా నువ్వు ఔననడం - భేషుగ్గా ఉంది. దీనికి ప్రేమ అని పేరొకటి!"

"ప్రేమ పుట్టడానికి అరనిమిషం చాలు. ఆరేళ్లపాటు కలిసి తిరిగినా పుట్టకపోవచ్చు."

అనసూయ మాటలకు శశికాంత్ రెచ్చిపోయాడు. రవిని చంపేస్తానన్నాడు. పెళ్లిపీటలు ఎక్కడానికి

ముందే సమాధి చేసేస్తానన్నాడు. నానామాటలూ అన్నాడు. అదంతా తనంటే ప్రేమ వల్లనే అని అనసూయకు తెలుసు. కానీ అప్పటికే రవికి మనసు అర్పించేసిందామె. శశికాంత్ పట్ల ఒక పక్క జాలి కలుగుతూనే భయం కూడా వేసింది. ఇలాటి ఇంట్రోవర్టులు దేనికైనా తెగిస్తారని వింది. రవికి అపకారం తలపడతాడేమోనని అనుమానించింది. అతని గురించి లేనిపోనివి కల్పిస్తాడేమోనని సందేహించింది. కానీ అవేమీ జరక్కుండానే పెళ్లి జరిగిపోయింది. శశికాంత్ గైరుహాజరయి రక్షించాడు.

"కాస్సేపుంటే ఆయన బజారు నుండి తిరిగివచ్చేస్తారు. ఈ ఉత్తరం ఆయన కంటబడుతుంది. ఈ లోపుగానే చూసి పారేస్తే సరిపోతుంది.' అనుకుంటూ ఉత్తరం చింపింది అనసూయ. లోపల ఏవేవో పేపరు కటింగ్‌లు. నాలుగైదు పేర్లు. నలుగురైదుగురు అబద్ధాలు చెప్పి పెళ్లి మీద పెళ్లి చేసుకున్న వైనాలు. పెళ్లి చేసుకోవడం, నెల తిరక్కుండా పెళ్లి కూతుర్ని చంపేసి మాయం అయిపోవడం. అందరూ ఒకలాటి వాళ్లే. చదివి, చదివి విసుగొచ్చింది. 'రవి కూడా ఇలాటి వాడేమో చూసుకో' అని శశి హెచ్చరిస్తున్నాడా? ఎటువంటి మనిషిరా బాబూ అనుకుని విసుక్కుంటూ ఆఖరి కటింగ్ చూడబోయింది అనసూయ. అది రెండేళ్ల క్రితంది.

దాంట్లో చంద్రశేఖర్ అనే అతని గురించి రాసేరు. అంతకుముందు చదివిన పేపరు కటింగులన్నీ కూడా అతని గురించేట. రకరకాల పేర్లు పెట్టుకున్నా అసలు పేరు చంద్రశేఖరుట. పట్టుకుని కోర్టుకి తీసుకొస్తూండగా తీసిన అతని ఫోటో కూడా వేసారు. గడ్డం అదీ బూచాడిలా ఉన్నాడు. సరైన సాక్ష్యాలు దొరక్క రెండేళ్ల శిక్ష మాత్రం విధించారుట. ఇటువంటి వాళ్లను ఉరివేసేయాలి. అనుకుంటూ ఆఖరి కాగితానికి వచ్చింది. శశికాంత్ చిన్న నోట్ రాసాడు. 'ఈ ఉత్తరం నీకు అందేసరికి మీ ఊళ్లోనే ఉంటాను. ట్రావెలర్స్ బంగళాలో బసచేస్తాను. అవసరమయితే ఫోన్‌చేయి.' అని. సంతకం చేయలేదు.

'మనిషి మారలేదు. ఆ పిరికితనం పోలేదు. సంతకం చేయడానికి కూడా భయమే!' అని నవ్వుకుంటూ అనసూయ ఆ పేపరు కటింగ్‌లు పక్కన పడేసింది. 'అవసరమయితే'ట. తనకేం అవసరం! హాయిగా హనీమూన్ జరుపుకుంటూన్న కొత్త పెళ్లికూతురుకు లోకంతో అవసరం ఏముంటుంది? కనీసం నెల్లాళ్ల పాటయినా లోకానికి దూరంగా ఉండాలనుకుంటే, ఇలా వెంటపడి వేధించడం దేనికి? రేపటికి నెల పూర్తవుతుంది. ఊరొచ్చాడు కాబట్టి భోజనానికి పిలిస్తే?' అనుకుంటూండగానే 'నెల పూర్తవడం' అన్న విషయం ఆమెలో ఆలోచనలను రేకెత్తించింది. నెల తిరక్కుండా నవ వధువును మట్టుపెట్టే చంద్రశేఖర్ గుర్తుకువచ్చాడు.

కిందపడేసిన పేపరు తీసి అతని ఫోటో కేసి చూసింది. ఎక్కడో చూసినట్టుంది. పరీక్షగా చూసింది. తెలిసున్న వ్యక్తే అనుకుంటూండగానే తట్టింది – చంద్రశేఖరూ, రవి ఒకరే అని.

ఆ తర్వాత గడిచిన పావుగంటలో అనసూయకు చాలా విషయాలు తెలిసివచ్చాయి. తోటమాలి చెప్పిన రేటు కరెక్టే అన్నమాట. ఒక్క రూపాయి ఖర్చు పెట్టకుండా తన డబ్బుతోనే ఇల్లు కొనిపించాడు రవి. ఇల్లు అతని పేర పెట్టించుకున్నాడు. ఫిక్సెడ్ డిపాజిట్ నామినేషన్ తనపేర మార్పించుకున్నాడు. రేపటితో నెల పూర్తయిపోతుంది కాబట్టి ఇవాళ రాత్రే తనను చంపివేస్తాడు. చంపేసిన తర్వాత శవాన్ని ఇంట్లోనే పాతిపెట్టి ఇల్లు అమ్మేస్తాడు. తనెక్కడ? అని అడిగిన వాళ్లకు హైదరాబాదు వెళ్లిందని చెప్తాడు. అందుకే టిక్కెట్టు కొనడం, తోటమాలికి చెప్పడం. ఇంకో ఊరెళ్లి ఇంకోదాన్ని కట్టుకుంటాడు. ఇదంతా కష్టపడి కూపీలాగాడు శశి. తనను హెచ్చరిస్తున్నాడు. తనకు సహాయం చేయడానికే ఈ ఊరు వచ్చాడు. తను అడిగితే పెళ్లి చేసుకోవడానికి కూడా రెడీ అంటాడు.

ఉలిక్కిపడి లేచింది అనసూయ. టైము ఎనిమిదయింది. ట్రావెలర్స్ బంగళాకు ఫోన్ చేసి శశికాంత్ గురించి అడిగింది. బయటకు వెళ్లారన్నారు. వస్తే చెప్పమని చెప్పింది. తర్వాత పోలీస్‌స్టేషన్‌కి ఫోన్ చేసింది. కానిస్టేబుల్ మాత్రమే ఉన్నాడు. ఇన్‌స్పెక్టర్ తొమ్మిది గంటలకు కానీ రాడట. తన అడ్రసు చెప్పి ఆపదలో ఉన్నాను. వచ్చి కాపాడాలని చెప్పింది. ఆ పల్లెటూర్లో ఇలాటి అనుభవాలు లేని కానిస్టేబుల్ నమ్మలేదు. అయినా ఎందుకైనా మంచిదని ఇన్‌స్పెక్టర్ వచ్చాక చెప్తానన్నాడు.

ఫోన్ పెట్టేసాక తట్టింది అనసూయకి. అసలు ఈ ఇంట్లో ఉండడం కంటే పారిపోతే నష్టమేముందని. స్టేషన్‌కి వెళ్లి కూచుంటే సరి. ఏదో ఒక ట్రెయిన్ దొరక్కపోదు. లేకపోతే ట్రావెలర్స్ బంగళాకు వెళ్లి, శశి వచ్చేవరకూ కూచున్నా ఫరవాలేదు. ఐదు నిమిషాల్లో ఆమె తయారయ్యింది. సరిగ్గా తలుపు తీస్తూంటే వచ్చాడు రవి.

అతని నవ్వు మొహం చూడగానే అనసూయ భయాలన్నీ మాయమయిపోయాయి. ఎంత స్వచ్ఛమైన నవ్వు! ఒకవేళ శశి పొరబాటు పడ్డాడేమో!? మనిషిని పోలిన మనుష్యులుండవచ్చు. ఏవో పేపరు కటింగ్‌లు చూసి మనిషి గురించి నిర్ధారించేస్తే ఎలా? అసలే పేపర్లో వేసిన ఫోటోలు గుర్తుపట్టడం కష్టం. పట్టినా మర్నాడు 'సవరణ - నాగిరెడ్డిది బదులు చక్రపాణి బొమ్మ వేసాం. చింతిస్తున్నాం' అనేయగలరు. తను అనవసరంగా భయపడిందేమో!

"ఏమిటి? రాణీగారు ఎక్కడికో బయలుదేరినట్టున్నారు. భృత్యుడితో ఎపాయింట్‌మెంట్ మాట మరచినట్టున్నారు." అన్నాడు రవి నవ్వుతూ.

అనసూయ కనుబొమ్మలు ముడివేసి, "ఏ అపాయింట్‌మెంట్?" అంది.

"రాత్రి తొమ్మిదిగంటల ఎపాయింట్‌మెంట్. మనం ఇద్దరం కలిసి ఫోటోలు డెవలప్ చేద్దాం అన్నానుగా. ఆ మూల గది డార్క్‌రూమ్ చేసి రెడీగా పెట్టడమే కానీ ఫోటోలు డెవలప్ చేయడం ఇప్పటిదాకా కుదరనే లేదు. మన హనీమూన్ తాలూకు ప్రైవేట్ ఫోటోలు చూడాలన్న కుతూహలం లేదూ?"

"ఛీ, పొండి. మీకు బొత్తిగా సిగ్గులేదు" అంటూ సిగ్గుపడుతూండగానే అనసూయకు గుర్తుకువచ్చింది చంద్రశేఖర్ సంగతి. అతనూ ఇంతే. ఇంట్లో ఒక డార్క్‌రూమ్ తయారు చేసి అక్కడే ఫోటోలు చూస్తూండగా ఓ బండరాయి పెట్టి భార్య తల పగలకొట్టేస్తాడు. నేరస్తులు తమ మోడస్ ఒపరాండి మార్చుకోరని ఎక్కడో చదివింది. రవి, చంద్రశేఖరూ ఒకరేనేమో!

కాదనుకుంటూనే, "ఇవాళ వద్దులెండి. రేపు చూసుకుందాం" అంది అనసూయ జాగ్రత్తగా.

"వద్దు. ఇవాళే చేద్దాం. ఏదైనా ప్లాను చేస్తే దాని ప్రకారమే చేయడం నా అలవాటు. అయినా మధుమాసం వెళ్లేలోపునే ఆ ఫోటోలు చూడాలి కానీ తర్వాత చూస్తే మజా ఏముంది?" అన్నాడు రవి స్థిరంగా.

నెల గడువు వినగానే అనసూయ ఉలిక్కిపడింది. గజగజ వణికింది. అతన్ని ఎదిరించి పోట్లాడలేనని, పారిపోలేనని గ్రహించి మరింత భయపడింది. "సరే, సరే, ముందు కాఫీ తెస్తాను. తాగండి" అంటూ వంటింట్లోకి పరిగెట్టింది. కాఫీ తయారుచేస్తూనే భగవంతుణ్ని ప్రార్థించింది - ఆ ఇన్‌స్పెక్టర్ తొమ్మిది గంటల కల్లా స్టేషన్‌కి రావాలనీ, అక్కణ్నుంచి నేరుగా తమింటికి రావాలనీ. అప్పటిదాకా రవిని ఆపడం ఎలా? అతన్ని నిర్వీర్యుణ్ని చేయడం ఎలా?

రవి కాఫీ తాగుతూండగా అనసూయ మొదలుపెట్టింది. "ఏమండీ, మన హనీమూన్ పూర్తవవస్తోంది కాబట్టి ఇప్పుడు ధైర్యంగా చెప్పుకోవచ్చు. మీరింతకు ముందు ఎవర్నైనా ప్రేమించారా?"

రవి మొహం చిట్లించాడు. అంతలోనే సర్దుకున్నాడు. "ఏవో ఎఫైర్స్ ఉన్నాయిలే. ఇద్దరమ్మాయిలు నా వెంట పడ్డారు, ఒకేసారి. ఏదో పైపైన వ్యవహారాలే. అయినా నీలాటి అందగత్తె రాసి పెట్టి ఉండగా వాళ్లకెలా చిక్కుతాను?" అంటూ బుగ్గమీద చిటికేసాడు.

అనసూయ మాత్రం సీరియస్‌గా, "మీరు నిజం చెప్పేసారు కాబట్టి నేను ఉన్న విషయం చెప్పడం మర్యాద. నాకూ గతం ఉంది." అంటూ చెప్పబోయింది.

రవి ఇంట్రస్టు చూపలేదు. "అవన్నీ ఇప్పుడెందుకు? అనవసరం" అన్నాడు.

"అది నాకు అవసరం. అవి చెప్పేస్తేనే నాకు మనశ్శాంతి" అంది అనసూయ దృఢంగా. లేచి పెద్ద లైటు ఆర్పేసింది. చిన్న లైటు కాంతి రవి మొహం మీద పడుతూండగా తను ఇదివరకు నేర్చుకున్న

హిప్నటిజం గుర్తుకు తెచ్చుకుంటూ అతిని కేసి సూటిగా చూస్తూ చెప్పసాగింది -

"నా కిదివరకే పెళ్లయింది. ఒకసారి కాదు. రెండు సార్లు. నా భర్తలు ఇద్దరూ పోయేరు. నా వల్లనే. నాకు నాలుగు లక్షలు వచ్చింది మా నాయనమ్మ వల్ల కాదు. నా భర్తలు చావడం వల్ల. నేను డబ్బు కోసం చంపలేదు. వాళ్లు నా పట్ల అన్యాయం చేస్తున్నారని గ్రహించినప్పుడు నేను ఊరుకోలేకపోయాను..."

రవి నిశ్చేష్టుడై వింటూ ఉండగా అనసూయ చెప్పుకుపోయింది. ఆ కథ అలా సాగిస్తూనే ఆమె గడియారం కేసి చూస్తూ ఉంది మధ్యమధ్యలో. తొమ్మిదింపావుకి బయట స్కూటర్ చప్పుడు విని ఇన్‌స్పెక్టర్ వస్తున్నాడని గ్రహించింది. కానీ ఆ చప్పుడు రవిని మేల్కొల్పినట్టుంది కూడా. "ఎంతమందిని చంపుతావే రాక్షసీ!" అంటూ లేచి రాబోయాడు.

"ఇదే ఆఖరిఘట్టం" అనుకుంటూ "మిస్టర్ రవీ! నువ్వు కూడా నన్ను మోసం చేసావ్. ఇల్లు రెండు లక్షలకు కొని మూడు లక్షలని చెప్పావు. అందుకే నిన్ను విడిచిపెట్టలేదు. నీకు ఇచ్చిన కాఫీలో విషం కలిపాను. నీ చావు తథ్యం" అంది అనసూయ లేచి తలుపుతీస్తూ.

ఆ మాట వింటూ రవి కుప్పకూలిపోయేడు. భయంతో అతని మొహమంతా చెమట్లు పట్టాయి. గొంతు పట్టుకుని నేల మీద దొర్లాడు. "ఆఁ, ఆఁ" అంటూ ఆర్తనాదం చేసేడు. చావుకళ వచ్చేసింది.

లైటు వేసి తలుపు తీసిన అనసూయను తోసుకుంటూ లోపలికి వచ్చిన ఇన్‌స్పెక్టర్ రవిని చూస్తూనే ఖంగారు పడ్డాడు. "ఏమయింది?" అంటూ.

"నా భార్య నా మీద విష ప్రయోగం చేసింది ఇన్‌స్పెక్టర్?"

"నిజమా" అంటూ తనకేసి ప్రశ్నార్థకంగా చూసి ఇన్‌స్పెక్టర్ కేసి నవ్వుతూ చూసింది అనసూయ. "అది నిజం కాదు సార్. భయంతోనే మూర్ఛబోయాడు. మీరు వచ్చేదాకా నాకు అపకారం తలపెట్టకుండా ఉండడానికి ఏవేవో కల్పించి చెప్పాను. హడిలిచచ్చాడు. కావాలంటే వెంటనే పరీక్ష చేసుకోండి. రేపు నేను ఉండను. ఊరెళ్లిపోతున్నాను. టిక్కెట్టు ఎలాగూ ఉంది." అంది ఆమె హుషారుగా.

మర్నాడు అనసూయ ఊరు వెళ్లలేకపోయింది. ఇన్‌స్పెక్టర్ హాస్పటల్‌కి చేర్చేలోపునే రవి ప్రాణం పోవడం, శవ పరీక్షలో అతని శరీరంలో విషం ఉందని తేలడం, రవి ఇన్‌స్పెక్టర్‌తో అన్నమాటలూ - వీటివల్ల ఆమెను అరెస్టు చేయడం జరిగింది.

ఆమె పోలీసు కస్టడీలో ఉండగానే శశికాంత్ ఆమెను చూడటానికి వచ్చాడు. "నేను రవికి నిజంగా విషమివ్వలేదు శశీ" అంటూ బావురుంది అనసూయ.

"నాకు తెలుసు" అన్నాడు శశికాంత్.

"నీకెలా తెలుసు?"

"స్టేషన్ దగ్గర కనబడితే సాయంత్రం హోటల్‌కి వెళదామని పిలిచాను. నా పేపరు కటింగ్‌లు నువ్వు నమ్ముతావో లేదో నాకు తెలియదు. ఎందుకైనా మంచిదని ఎవరి చేతికీ మట్టి అంటుకోకుండా వాణ్ణి మట్టుబెట్టి నిన్ను కాపాడదామని విషం పూసిన సూది గుచ్చాను హొటల్లో తింటూ ఉండగా. ఓ గంట తర్వాతనే పనిచేస్తుందన్నాడు అది నాకు అమ్మినవాడు. అన్న ప్రకారమే చచ్చాడు కానీ నువ్వు అనవసరంగా ఇరుక్కున్నావు. ఇప్పుడు నేను సాక్ష్యం చెప్పినా కోర్టువాళ్లు నమ్ముతారో, లేదో! నాకు సూది అమ్మినవాడు ఏమీ తెలీదనేస్తాడు ఖచ్చితంగా. ఏం చేయాలో లాయర్ని అడుగుతాను. లెటజ్ హొప్ ఫర్ ది బెస్ట్!!"